మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు

-మండల విద్యాశాఖ అధికారి మనీల

**హుస్నాబాద్ రూరల్, జూన్ 25, ప్రభాతవార్త:**

పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ మండల విద్యాశాఖ అధికారి బండారి మనీల హెచ్చరించారు. వారంరోజుల క్రితం ప్రభాతవార్తలో విద్యార్థులపై ఫీజుల భారం అనే శీర్శికతో ప్రచూరితమైన వార్తతో పాటు బిఎస్‌పి నియోజకవర్గ ఇంచార్జ్ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిఈవోకు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పట్టణ కేంద్రంలోని ఆల్ఫోర్, శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం ఈటెక్నో స్కూల్‌తోపాటు మరో ప్రయివేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్‌యూనిఫాంలు విక్రయించడంతోపాటు అధికఫీజులు వసూళ్లుచేస్తున్నారని, పాఠశాలల్లోని రికార్డులను తనిఖీలుచేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని, ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలలో కనీసవసతులు లేకుంటే వారంరోజుల్లో వారిగుర్తింపు రద్దుచేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది సంజీవ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

## ఆగని ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీ

-కొమ్ము ఉమేష్‌యాదవ్

**గజ్వేల్ టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:**

ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం టెక్స్‌బుక్స్, నోటుబుక్స్, డ్రెస్సులు, ట్యూషన్, బస్సు, డొనేషన్ ఇలా అనేక రకాలుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి దోపిడీ చేస్తున్నారని జిల్లా బిసి సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2005 ఫీజు నియంత్రణ చట్టం అమలులో ఉన్నా అవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల రక్తం తాగుతున్నారని అన్నారు. ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఫీజు నియంత్రణ చట్టం అమలులోకి తీసుకువచ్చి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని లక్ష్మణ్, బాబు, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

-కలెక్టర్‌కు రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం



కలెక్టర్‌కు పూలబొకేను అందచేస్తున్న సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం

**నాగల్‌గిద్ద, జూన్ 25, ప్రభాతవార్త:**

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని అంబేద్కర్ పూలే సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రహీం అన్నారు. బుధవారం సంగారెడ్డిలో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను అబ్దుల్ రహీం తన బృందం సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా అబ్దుల్ రహీం కలెక్టర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అసైన్డ్ భూములు ఉన్న రైతులకు పూర్తి సర్వే హక్కులు కల్పించాలన్నారు. 1977 ఓపిటి చట్టం రద్దుచేసి పూర్తిహక్కులను రైతులకు కల్పించాలన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అసైన్డ్ భూములను మంజూరు చేసిందని, సదరు అసైన్డ్ భూముల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతివనాలు, స్మశానవాటికలు, క్రీడామైదానాలు, డంపింగ్‌యార్డులు నిర్మించి రైతులకు అసైన్డ్ భూములను వినియోగించుకోకుండా చేసిందని ఆరోపించారు. శాసనసభ సమావేశాల్లో పిఓటి చట్టం రద్దుచేసి పేద రైతులకు పూర్తిహక్కును కల్పించేందుకు చట్టం రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సదరు రైతులకు సమాన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించాలని కలెక్టర్‌కు అందచేసిన వినతి పత్రంలో పేర్కొన్నామన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ పూలే సేవాసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.పండరి, రాష్ట్ర కార్యదర్శి గౌస్ చిస్తి, జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌ఫామ్ రైతుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



నర్మెటలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఆయిల్‌ఫామ్ రైతుల పట్ల కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. నంగునూర్ మండలం నర్మెటలో నిర్మాణంలో ఉన్న ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని ఆయన బుధవారం సందర్శించి పనుల పురోగతిపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.300కోట్లతో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీనిర్మాణంనపనులు చేపట్టడం జరిగిందన్నారు. రైతులకు లాభదాయకమైన పంటలు పండాలని అయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని మాజీ సిఎం కెసిఆర్ బిఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేశారని తెలిపారు. సిద్దిపేట జోన్‌కి రూ.300 కోట్లతో అసియా ఖండంలోనే అత్యుత్తమమైన ఫ్యాక్టరీని నిర్మించడం జరుగుతుందన్నారు. ఆయిల్ తయారుచేసి ప్యాకింగ్‌వరకు ఇక్కడే ఏర్పాటుచేయడం జరుగుతుందన్నారు. కాళేశ్వరంప్రాజెక్టు రంగనాయక సాగర్ నుంచి నీళ్లు ఈప్రాజెక్టుకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతియేటా 10కోట్ల లీటర్ల నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు ఆయిల్‌ఫామ్ సాగుకు సహకరించాలన్నారు. ఈప్రజలకు ఈఫ్యాక్టరీ వరంలాంటిందని, యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు.

## మెగా ఉచిత వైద్యశిబిరానికి మంత్రికి ఆహ్వానం




వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 25, ప్రభాతవార్త:**

జూలై 1వ తేదీ మంగళవారం హుస్నాబాద్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని రైతుబజార్‌లో మెగా ఉచితవైద్యశిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అక్కు శ్రీనివాస్ తెలిపారు. ఈ వైద్యశిబిరానికి రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖమంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ హాజరుకావాలని కోరుతూ బుధవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి ఆహ్వానించి మంత్రి చేతుల మీదుగా ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రిని కలిసిన డాక్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన డాక్టర్ కొండి సప్తరుషిని మంత్రి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నిర్వహించబోయే వైద్యశిబిరంలో 15మంది వైద్యులు వివిధవిభాగాలనుండి వచ్చి సేవలందించనున్నట్లు వివరించారు. మంత్రిని కలిసినవారిలో డాక్టర్లు సప్తరుషి, రమాదేవి, సందీప్‌కుమార్, లావుడ్య ధర్మానాయక్, జాగిరి తిరుపతితోపాటు తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

-ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**చౌటకూరు, జూన్ 25, ప్రభాతవార్త:**

షెడ్యూల్డ్‌కులాలు, తెగలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేయనున్నట్లు రాష్ట్ర ఎస్సి,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పనిచేస్తున్న ఎస్సి,ఎస్టి ఉద్యోగులను అవమానపరిస్తే, వివక్షప్రదర్శిస్తే తమకు ఫిర్యాదుచేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో తరుచూ దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కొనసాగిన దాడులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలకు సిఫార్సు చేశామన్నారు. బక్కి వెంకటయ్యను ప్రిన్సిపాల్ జి.నరసింహ పూలబొకేను అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్రరావు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యంసేవించి వాహనాలు నడిపిన 26మందికి రూ.39వేల జరిమానా

**గజ్వేల్ టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:**

మద్యంసేవించి వాహనాలు నడిపిన 26మందికి రూ.36వేల జరిమానా విధించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్ రోడ్, క్యాసారం ఎక్స్‌రోడ్, తూప్రాన్ రోడ్డు, ముట్రాజ్‌పల్లి రోడ్డు, సంగాపూర్, ఔటర్‌రింగ్ రోడ్డుల్లో సిబ్బందితోకలిసి వాహనాల తనిఖీనిర్వహిస్తుండగా మద్యంసేవించి వాహనాలు నడుపుతున్న 26మందిని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు వచ్చిందని తెలిపారు. వారిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ చేసి 26మందికి రూ.39వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

# నెలరోజుల్లో రైతులకు సాగునీరు అందించాలి

-మెదక్ ఎంపి రఘునందన్‌రావు



ఇరిగేషన్ అధికారుల సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

**చిన్నకోడూరు, జూన్ 25, ప్రభాతవార్త:**

ఇరిగేషన్ అధికారులు వందలకోట్లతో పట్టుబడుతున్నారు. ఎసి కార్యాలయాల్లో కూర్చొని రైతులకు నీళ్లు మాత్రం ఇవ్వడం లేదని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్‌వద్ద మల్లన్నసాగర్ 12వప్యాకేజీ పనులపై ఇరిగేషన్ అధికారులు, మెగా కంపెనీ ప్రతినిధులతో ఆయన బుధవారం సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడారు. 18నెలల నుంచి అధికారులు ప్రజాప్రతినిధులతో ఎందుకు సమీక్షా సమావేశం నిర్వహించలేదని, జీతాలు తీసుకోవడం లేదా అని ప్రశ్నించారు. నెలరోజుల్లో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆదేశించారు. 2022లో పనులకు శంకుస్థాపన చేసినా నేటివరకు ఎందుకు సాగునీరు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల్లో నేటి నుంచి ఇరిగేషన్ అధికారులు పర్యటించాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో రైతులు ప్రాజెక్టుతో నష్టపోవడం జరిగిందని మెగా కంపెనీ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రాజెక్టులు, కాలువలపై అవగాహన లేదన్నారు. తొగటలో మల్లన్నసాగర్ ఉన్న విషయం కూడా తెలియదన్నారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన పనులు పూర్తి చేయాలని విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. సమీక్షాసమావేశంలోలో ఇరిగేషన్ అధికారులు, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# శిశు మరణాలపై పూర్తి నివేదికను అందించాలి

-సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి
-పేదలకు వైద్యసేవలు అందించడంలో జిల్లాను ఆదర్శంగా నిలపాలి
-జిల్లా కలెక్టర్ హైమావతి



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

పిహెచ్‌సిల వారీగా సంవత్సర కాలంలో జరిగిన శిశుమరణాలపై పూర్తి నివేదికను అందించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు అందిస్తున్న వివిధ ఆరోగ్యసేవలపై ఆమె సమీక్షాసమావేశం నిర్వహించి మాట్లాడారు. క్షయ వ్యాధి కార్యక్రమంలో భాగంగా, టిబి ముక్తి అభియాన్‌పైన జిల్లాలో చేపడుతున్న ఆరోగ్య సేవలను ప్రోగ్రామ్ ఆఫీసర్ ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాత, శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీ నమోదు దగ్గర నుంచి ప్రసవం అయ్యేంతవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన ఎప్పటికప్పుడు వైద్యాధికారులు సమీక్షలు నిర్వహించుకోవాలని ఆదేశించారు. వైద్య అధికారులకు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ఓపి సంఖ్య పెంచాలని ఈసంజీవిని పోర్టల్ లో ఓపి సేవలు పొందిన పేర్లను ఎప్పటికప్పుడు నమోదు చేసి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో భాగంగా వెల్ఫేర్ హాస్టల్స్‌లో ప్రత్యేక ఎనీమియా స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. హాస్టల్లోని విద్యార్థులకు వేడి చేసి చల్లార్చిన సురక్షితమైన నీటిని వేడి వేడి ఆహార పదార్థాలను అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా అర్హులైన పిల్లలందరికీ సకాలంలో వంద శాతం టీకాలు అందించాలన్నారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరు మెరుగుపరుచుకోవాలని, జిల్లాను అన్ని ఆరోగ్య కార్యక్రమాల సేవలో ఆదర్శంగా నిలపడానికి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలకు వస్తానని సమయ పాలన పాటించాలని, అలా పాటించని వారిపైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పల్వన్ కుమార్, వైద్యాధికారులు శాంత, అన్నపూర్ణ, రేవతి, శ్రీనివాస్, ఆనంద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీని జిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించారు.

# భూభారతి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంచేయాలి

-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డిమున్సిపాలిటీ, జూన్ 25, ప్రభాతవార్త:**

భూభారతి రెవిన్యూ సదస్సులో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య, ఆర్‌డిఓలను, మండల తహసీల్దార్‌లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మండల తహసీల్దార్‌లతో కలెక్టర్ సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడు, తూ భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుకు సంబంధించిన అన్ని దరఖాస్తులను క్లియర్ చేయాలని అన్నారు. అన్ని మాడ్యుల్స్‌లో దాఖలైన భూభారతి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని అన్నారు. భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్, డేటా కరెక్షన్ వంటి దరఖాస్తుల అవసరమైనరికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణచేపట్టిన తర్వాతే పరిష్కరించాలని అన్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. అవసరమైన రికార్డులను కూడా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ మాధురి, రెవిన్యూ డివిజనల్ అధికారులు రవీందర్‌రెడ్డి, అశోకచక్రవర్తి, పాండు, రామ్‌రెడ్డి, తహసీల్దార్‌లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ ఆసుపత్రులకు హబ్‌గా గజ్వేల్

-కన్సల్టెన్సీ పేరుతో అడ్డగోలుగా దోపిడీ
-గుర్తింపులేని ల్యాబ్‌ల ఏర్పాటు
-ఐఎంఎ తనిఖీలో బయటపడ్డ బాగోతం
-ఆసుపత్రులను తనిఖీచేసే అధికారం ఐఎంఎ వైద్యులకు లేదన్న డిఎంఅండ్‌హెచ్‌ఓ

**గజ్వేల్, జూన్ 25, ప్రభాతవార్త:**

నకిలీ వైద్యుల దందాకు గజ్వేల్ హబ్‌గా ఏర్పడింది. గత రెండుమూడు సంవత్సరాల నుండి గజ్వేల్ పట్టణంలో విచ్చలవిడిగా ప్రైవేట్ ఆసుపత్రులు ఏర్పాటుచేశారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నకిలీ ఆసుపత్రుల నిర్వహణ మూడు పూలు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఏకంగా కొన్ని ఆసుపత్రుల్లో అర్హతలేకున్నా సర్జరీలు, డెలివరీలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుతున్నారు. గతంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీకి అబార్షన్ చేయడంతో వికటించి ప్రాణాలు కోల్పోయిన సంఘటన జరిగింది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వైద్యులు అర్హత లేకున్నా చికిత్సను అందించడం ఏమిటని గజ్వేల్ పట్టణంలో ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు నేరుగా రంగంలోకి దిగి గజ్వేల్‌లో ఉన్న పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో నకిలీ ఆసుపత్రులను గుర్తించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఐఎంఎ వైద్యులను తప్పుబట్టారు. ఇదిలా ఉండగా గజ్వేల్ పట్టణం రోజురోజుకు జనాభా గణనీయంగా పెరగడంతో సంగాపూర్ రోడ్డు నుండి మొదలుకొని పలు చౌరస్తాలలో ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. పదిసంవత్సరాల క్రితం గజ్వేల్ పట్టణంలో ముఖ్యమైన నాలుగైదు ఆసుపత్రులు ఉండగా నేడు 30కిపైగా కొత్తగా ఆసుపత్రులు ఏర్పడ్డాయి. అర్హతల మాట దేవుడెరుగు ఆసుపత్రులు మాత్రం అన్నిసౌకర్యాలతో మల్టీసూపర్‌స్పెషాలిటీ పేరుతో ప్రారంభిస్తున్నారు. స్థానికతతో సంబంధంలేకుండా పలుజిల్లాల నుండి వైద్యులు గజ్వేల్‌కు వచ్చి ఆసుపత్రులను ఏర్పాటుచేస్తున్నారు. వైద్యులే కాకుండా డబ్బుంటేచాలు ఆసుపత్రిని ఏర్పాటుచేసి వైద్యులను నియమించి కన్సల్టెన్సీ ఫీజు తీసుకొని అడ్డగోలుగా దండుకుంటున్నారు. అర్హత ఉన్న వైద్యులు ఓపిలకు రూ.300 నుంచి రూ.వెయ్యి వరకు తీసుకుంటూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నకిలీ వైద్యుల వద్దకు రోగులు వెళ్తే కేవలం రూ.100 నుండి రూ.200 మాత్రమే ఉండడంతో రోగులు నకిలీ వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

**చూసీచూడనట్లుగా వైద్యాధికారులు...**

గజ్వేల్ పట్టణంలో అడ్డగోలుగా ఆసుపత్రులు, ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నా అర్హతలు ఉన్నాయా లేవా అన్నది జిల్లా వైద్యాధికారులు గమనించక పోవడం గమనార్హం. చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే ఐఎంఎ వైద్యులు రంగంలోకి దిగారు. ఆయా ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెద్ద పెద్ద బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటుచేసి అందులో వైద్యులు లేకున్నా వైద్యుల పేర్లు పెట్టుకొని చిన్నచితకా వైద్యులు రోగులను చూస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలను బాగుచేయాల్సినవైద్యులు లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, ఈక్రమంలో వైద్యాధికారులు తనిఖీలు చేస్తే ఎన్నో సంచలనమైన నిజాలు తెలుస్తాయని పలువురు కోరుతున్నారు.

**తనిఖీచేసే అధికారం ఐఎంఎ సభ్యులకు లేదు..**
**-డిఎంఅండ్‌హెచ్ఓ పల్వన్‌కుమార్**

ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేసే అధికారం ఐఎంఎ వైద్యులకు లేదని సిద్దిపేట జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ పేర్కొన్నారు. వారంరోజుల క్రితం ప్రైవేట్ వైద్యులు గజ్వేల్ పట్టణంలోని పలు ఆసుపత్రులను తనిఖీచేసినట్లు తమదృష్టికి రావడంతో ఐఎంఎ వైద్యులకు షోకాజ్ నోటీసులు అందించినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఎవరైనా దాడులకు పాల్పడితే సమాచారం అందించాలని, తనిఖీచేసే అధికారం కేవలం వైద్యఆరోగ్యశాఖకు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు.

## మంత్రిని కలిసిన తహసీల్దార్

**సంగారెడ్డి టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహను బుధవారం తహసీల్దార్ జయరామ్‌నాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకేను అందచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలు సమస్యలకు గురికాకుండా చూసుకోవాలని అధికారి జయరామ్‌నాయక్‌కు మంత్రి సూచించారు.



మంత్రికి పూలబొకేను అందచేస్తున్న తహసీల్దార్ జయరామ్‌నాయక్

## కాలిన స్థితిలో గుర్తుతెలియని శవం గుర్తింపు

**హత్నూర, జూన్ 26, ప్రభాతవార్త:**

హత్నూర మండలం పరిధిలోని కాసాలగ్రామ శివారులోగల ఇప్పలకుంటలో బుధవారం ఒక గుర్తుతెలియని మగవ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు హత్నూర ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మృతుని వయసు 25 నుండి 30 సంవత్సరాల మధ్య ఉంటుందని, కాలినస్థితిలో శవం లభించిందని, మృతదేహంపై గ్రే కలర్ జీన్స్ ప్యాంట్ ఉందని, కుడిచేతికి వెండి కడియం ఉందన్నారు. మృతుని గుర్తించేందుకు హత్యకుగల కారణాలను తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

## బుర్హానీ కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి


కాలనీ వాసులతో ఎమ్మెల్యే

**అల్వాల్, జూన్ 25 ప్రభాతవార్త:** మోహ్రం పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ కాలనీలోని బోర్హానీ కాలనీని బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సందర్శించారు. విద్యుత్ ఇతర శాఖలకు చెందిన అధికార యంత్రాంగంతో ఎమ్మెల్యే చర్చించారు. ప్రభుత్వం పరంగా మోహ్రం పండుగకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆయన సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు డోలి రేమష్, అనీల్ కిషోర్, ప్రభాకర్, మోసిన్, విజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం ఊరేగింపు సందర్భంగా ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేయాలి


రాష్ట్ర అగ్నిమాపక శాఖ డిజి వై.నాగిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మాజీ బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్,జూన్ 25 ప్రభాతవార్త :** మొహర్రం ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో ఎటువంటి సంఘటనలు జరగకుండ ముందు జాగ్రత్తగా ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డిని కలిసి మాజీ బిజెపి మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ వినతి పత్రం అందజేశారు.వచ్చే నెల 6వ తేదీన పాతనగరంలో మొహర్రం ఊరేగింపు జరుగుతుందని,ఊరేగింపు సందర్భంగా బిబికాఆలం,దారు ఫిఫా,చార్మినార్,చాధర్ఘాట్ ప్రాంతాలలో ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేయాలని ఆయన తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక శాఖ డిజి వై.నాగిరెడ్డికి అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ పాతబస్తీలో ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేయాలని డిజి నాగిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు. పాతబస్తీలో అన్ని వసతులు కల్పించాలని కోరుతూ జిహెచ్ఎంసి,వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖల అధికారులకు వినతి పత్రాలు అందజేయటం జరిగిందని ఆయన తెలియజేశారు.

## రోడ్డు వెడల్పు చేయాలి: ఎమ్మెల్యే


జోనల్ కమీషనర్‌తో కలిసి పాదయాత్ర ఎమ్మెల్యే మీర్ జుల్ఫకర్ అలీ,కార్పొరేటర్ సున్నం

**బేగంబజార్,జూన్ 25ప్రభాతవార్త:** పెరుగుతున్న జనాభా అనుగుణంగా రోడ్ల వెడల్పు పనులను వేగవంతం చేయాలని చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫకర్ అలీ అన్నారు.కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్,జోనల్ కమీషనర్,డిప్యూటి కమీషనర్,ప్రాజెక్టు ఇఇ,టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి దూద్‌బౌలి,హుస్సేనీ అలం, బారాగల్లీ,పేట్లబుర్జు పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు వెడల్పు పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టాలన్నారు.

## బొల్లి మచ్చలపై సదస్సు నిర్వహించిన వైద్యులు



బొల్లి మచ్చలపై నివారణపై ర్యాలీ నిర్వహించిన ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది

**అప్జల్‌గంజ్,జూన్ 25ప్రభాతవార్త:** అంతర్జాతీయ బొల్లి మచ్చల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకునిబుధవారం ఉస్మానియా ఆసుపత్రి చర్మవ్యాధుల ఆద్వర్యంలో వైద్యులు,నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులు కలిసిఆసుపత్రి ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఉస్మానియా ఆసుపత్రి సమా వేశ మందిరంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది,ఉద్యోగులతో కలిసి మచ్చల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సాహయ్,ఉస్మానియా ఆసుపత్రి చర్మవ్యాధులవిభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ భూమేష్ కుమార్,సుధీర్,అరుణ ,తెలంగాణస్టేట్ మెడికల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్,ఆర్.ఎం.ఓ జయకృష్ణ,కవితలతోపాటు వివిధ విభాగాలకు చెందిన వైద్యనిపుణులు పాల్గొన్నారు.

## తెలంగాణలో డ్రగ్స్ ఫ్రీ కోసం 100 రోజులు మహోద్యమం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివప్రసాద్, సోమనాథం

**సైఫాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు బానిస అవుతున్న యువతకు, విద్యార్థు లకు రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకై 100 రోజులపాటు అన్ని విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలకై మహోద్యమం నిర్వహిస్తున్నామని విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు టి.కె.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో డిఎస్పి సోమనాథం, పలువురు విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. డ్రగ్స్ వల్ల యువత, విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతున్నదని, అనేక విధాలుగా ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 7న ఈ కార్యక్రమం రవీంద్రభారతిలో ముగుస్తుందని, ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో విద్యార్థులు పవన్, రాము,రాజేష్, విష్ణు, వెంకట్, భాస్కర్ పాల్గొన్నారు.

## ఉత్తమ సంస్కారం, ప్రజాహితం కోరేవారు మరణించినా సమాజం మరువదు

**-కేంద్ర హోం శాఖ పూర్వ కార్యదర్శి పద్మనాభయ్య**


'డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పిఎల్.సంజీవరెడ్డి స్మారక పురస్కారాల' ప్రదానం చేస్తున్న కేంద్ర హోం శాఖ పూర్వ కార్యదర్శి పద్మనాభయ్య, చిత్రంలో ఎం.నరసింహప్ప, పైడి సందీప్, ఎం.కె.రాము తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త:** ఉత్తమ సంస్కారం, ప్రజాహితం కోరేవారు మరణించినా సమాజం మరువదని పద్మవిభూషణ్, కేంద్ర హోం శాఖ పూర్వ కార్యదర్శి కె. పద్మనాభయ్య అన్నారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 'డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పిఎల్.సంజీవరెడ్డి స్మారక పురస్కారాల' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ కవి డాక్టర్ ఎం.కె.రాము ఆధ్వర్యంలో జరిగింది. ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హాజరైన పద్మనాభయ్య చేతులమీదుగా పురస్కారాలను పూర్వ కేంద్ర విజిలెన్స్ కమిషనర్ కెవి.చౌదరి, వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు, ప్రముఖ సంగీత విద్వాంసులు నామా చంద్రబాబునాయుడు, ప్రముఖ రచయిత్రి డాక్టర్ శరత్‌జ్యోత్స్నారాణిలకు అందించారు. పద్మనాభయ్య మాట్లాడుతూ పైడి లక్ష్మయ్య సమాజిక దృష్టితో విశేష కార్యక్రమాలు నిర్వహించగా, సంజీవరెడ్డి తండ్రికి తగ్గ తనయుడిగా పేరును సంపాదించారన్నారు. మంచితనానికి మారుపేరుగా ఇరువురు నిలుస్తారని, ఎవరి రంగాలల్లో వారు గొప్పగా రాణించి సమాజంలో తమకంటు ప్రత్యేక స్థానంను సంపాదించారన్నారు. కార్యక్రమంలో పైడి సందీప్, కృష్ణ, రమాదేవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్టర్ ఎంకె.రాము రచించిన 'నందమూరి నవోదయం-సంగీత నృత్యోత్సవం' అంశంపై నృత్య దర్శకులు రేణుకాప్రభాకర్, వై.సుమలత శిష్యబృందం సభ్యులు భావజ్ఞ, దీపిక, వైష్ణవి, గీతిక, రితిక, అశ్విత, శ్రేయ, ప్రణతి, లిఖిత, దియాన్షి, ఆకాంక్ష, రోహిత, రజని, సహస్ర, శాన్వీ, రూప హంసిని, నక్షత్ర, లక్ష్మీదుర్గా, శివాని, భవిష్య, నమ్రత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాఖ్యాతగా కళారత్న అవార్డుగ్రహీత ఎంకెఆర్.ఆశాలత నిర్వహించారు.

## బార్ కౌన్సిల్ ఛైర్మన్‌ను సన్మానించిన నోటరీ అడ్వకేట్ల సంఘం


సునీల్ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నోటరీ అడ్వకేట్‌లకు బార్ కౌన్సిల్ అండగా నిలుస్తుందని తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రాక్టీసింగ్ నోటరీ అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గంజి యాదగిరి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు హై కోర్టులోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ కే. సునీల్ గౌడ్, కార్యదర్శి వి.నాగలక్ష్మీలను కలిసారు. కృతజ్ఞతపుర్వకంగా ముగ్గురిని శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా తానా రాష్ట్ర అధ్యక్షుడు గంజి యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ప్రాక్టీస్ చేస్తున్న నాలుగువేల మంది నోటరీ అడ్వకేట్ల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని అన్నారు. కొద్ది రోజుల క్రితం తాము వినతిపత్ర రూపంలో పలు సమస్యలను బార్ కౌన్సిల్‌కు సమర్పించామని తెలిపారు. అందుకు సమ్మతించి తమకు న్యాయం చేసిన బార్ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శిలను సన్మానించి కృతజ్ఞతలు తెలిపామని చెప్పారు. భవిష్యత్తులో కూడా బార్ కౌన్సిల్ తమకు అండగా నిలుస్తుందని ఆశిస్తున్నామని గంజి యాదగిరి అన్నారు.ఈ కార్యక్రమంలో నోటరీ అడ్వకేట్ల సంఘం గౌరవ అధ్యక్షుడు గోలి దేవేందర్ బాబు, కార్యదర్శి మాయబ్రహ్మ నరసింహ, కోశాధికారి ఏబి.నర్సింగ్ రావు, కార్యవర్గ సభ్యులు కే. మురళీధర్, ఎం.ఎం.బేగ్, కే.నరసింహారావు, కుమనన్ బలరాం, ఎం.వెంకటేశ్వర్లు, పి సతీష్, సుదర్శన్ చారి, కే. సత్యనారాయణలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీసులతో సహకరించాలి: ఎసిపి యాదగిరి


సమావేశంలో ప్రసంగిస్తున్న గాంధీనగర్ ఏసీపీ యాదగిరి

**ముషీరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** శాంతి భద్రతల పర్యవేక్షణలో ప్రజలు కూడా పోలీసులతో సహకరించాలని గాంధీనగర్ ఏసీపీ ఏ.యాదగిరి కోరారు. బుధవారం సాయంత్రం లోయర్ ట్యాంక్‌బండ్ పైనున్న జగదీష్ మందిర్ లో దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై ఏసీపీ మాట్లాడుతూ వీధి వ్యాపారులు సమయపాలన పాటిస్తూ ఉండాలని, ప్రతి రోజూ నిర్దిష్ట సమయంలో తమ దుకాణాలను మూసివేస్తూ ఉండాలని, అర్ధరాత్రి వరకు దుకాణాలను తెరిచి ఉంచవద్దని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, దుకాణదారులు కూడా పోలీసులకు సహకరించాలని సూచించారు.సమావేశంలో దోమలగూడ ఎస్‌హెచ్ఓ డి.శ్రీనివాసరెడ్డి, సెక్టర్ ఎస్ఐ కే.శ్రీనివాసరెడ్డి, ట్యాంక్ బండ్ స్ట్రీట్ వెండర్స్ అండ్ హాకర్స్ అసోసి యేషన్ సభ్యులు రమేష్‌రాం, శంకర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేత మహ్మద్ సర్దార్ కుటుంబానికి అండగా నిలుస్తాం


బోరబండలో ఇటీవల మృతి చెందిన సర్దార్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాగంటి సునీత గోపినాథ్.

**యూసుఫ్‌గూడ, జూన్ 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ నాయకుల వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ మైనార్టీ నేత మహ్మద్ సర్దార్ కుటుంబాన్ని దివంగత ఎమ్మెల్యే మాగంటిగోపినాథ్ సతీమణి మాగంటి సునీత పరామర్శించారు. అదేవిధంగా దివంగత ఎమ్మెల్యే మాగంటిగోపినాథ్ , మహ్మద్ సర్దార్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సర్దార్ కుటుంబ సభ్యులకు పరామర్శించి వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

## యువత దేశానికి మూల స్తంభం

**చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త:**
పాన్ ఇండియన్ సామాజిక సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో పయనీర్ జాతీయ అవార్డ్స్ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషసాయి పాల్గొని జాతీయ అవార్డులను అందించి గౌరవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దేశానికి మూల స్తంభం అని, ఏ దేశమైనా ఏ ప్రాంతమైన యువత అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తేనే ఆ దేశం ప్రగతి పథంలో నడుస్తుందని ఉద్బోధించారు. సమాజం బాగుంటేనే దేశం ప్రగతి పదములో పయనిస్తుందని అందుకు సేవారంగం లోని వారు ముందుకు వచ్చి కీలకపాత్ర వహించాలని, సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. విభిన్న రంగాలలో విశేషంగా కృషి చేసిన 20 మంది యువతీ యువకులకు ప్రతిభవంతులకు పైనీర్ జాతీయ అవార్డు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వాహకుడు పాల్గొనగా అద్దంకి రాజా సభకు అధ్యక్షుడు చిలుమల బాల రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

## ఆత్మీయుల పేరిట పురస్కారాలు సంస్కారానికి నిదర్శనం

**-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి**


సాహితీ పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, జూన్ 25 ప్రభాతవార్త:** వ్యక్తులకు అత్యంత ఆత్మీయులు లోకం విడిచి వెళ్ళినపుడు వారి పేరిట ప్రతిభావంతులకు ఇచ్చే పురస్కారాలు వారి సంస్కారానికి నిదర్శనం అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై కళా పోషకుడు గుదిబండి వెంకట రెడ్డి అధ్యక్షతన సాహితీ కిరణం పత్రిక పదహారవ వార్షికోత్సవం సందర్భంగా పి.కమలా కేసరి నెలకొల్పిన డాక్టర్ పింగళి జనార్ధన రావు సాహితీ పురస్కారం కవి సత్య ప్రసాద్‌కు ఎస్ శంకర్ నెలకొల్పిన ఎస్ నర్సయ్య సాహితీ పురస్కారం, కవి రఘువీర్ ప్రతాప్ కి, ఎస్ బాలమ్మ స్మారక సాహితీ పురస్కారం మాధవి కి, జి సీతా రామారావు నెలకొల్పిన జి చెంచురామారావు సాహితీ పురస్కారం కవి రఘుశ్రీ కి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ బహుకరించి ప్రసంగించారు. పత్రిక నడపటం సులువు కాదని ప్రత్యేకం గా తెలుగు లో సాహిత్య పత్రిక నిర్వహించటం కత్తి మీద సాము అన్నారు. పొత్తూరి సుబ్బారావు ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటూ పదహారు ఏళ్లుగా నిరాటకంగా సాహిత్య కిరణం నిర్వహించటం విశేషం అని అభినందించారు. కళా పోషకుడు జి వెంకట రెడ్డి అధ్యక్షత వహించిన సభలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి,నేటి నిజం సంపాదకుడు బైస దేవ దాసు రచయిత్రి రాజ్య శ్రీ తదితరులు పాల్గొనగా సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు స్వాగతం పలకగా కవి పెద్దూరి వెంకట దాసు కార్యక్రమ నిర్వహణ చేశారు

## స్పోర్ట్స్ పాలసీ ఆమోదించడం హర్షణీయం

**-క్రీడామంత్రికి కృతజ్ఞతలు తెలిపిన శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి**


మంత్రి శ్రీహరికి మొక్కను ఇచ్చి ధన్యవాదాలు తెలుపుతున్న శివసేనారెడ్డి

**హైదరాబాద్,జూన్ 25,ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా విధానము ఆమోదించినందుకు యావత్తు తెలంగాణ క్రీడా కారుల తరుపున హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.ఈమేరకు బుధవారంసచివాలయంలో మక్తల్ నియోజకవర్గం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుండి విచ్చేసిన వివిధ గ్రామీణ క్రీడా సంఘాల ప్రతినిధులతో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేసే దిశగా పతకాలుసాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడమే కాకుండా పతకాలు సాధించే విధంగా విధానం రూపొందించబడడం హర్షనీయమన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన క్రీడా విధానం రూపొందించి ఆమోదించినందుకు సీఎం రేవంత్ రెడ్డి యావత్తు తెలంగాణ క్రీడా సమాజం ధన్యవాదాలు తెలియజేస్తుందని అన్నారు. సీఎం కప్ తరహా పోటీలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం కల్పిస్తామని క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

## మంత్రి పదవుల్లో యాదవులకు చోటు కల్పించకపోవడం దుర్మార్గం

**-30న జరిగే యాదవులు ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి**
**-బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్**


సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజారాంయాదవ్, రమేష్‌యాదవ్, రాములు యాదవ్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 25,ప్రభాతవార్త:**
దేశంలో,రాష్ట్రంలోఎంతో గొప్ప చరిత్ర, సంస్కృతి కలిగివున్న యాదవులకు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడం అత్యంత దుర్మార్గమని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవుల ఆత్మగౌరవసభ పోస్టర్‌ను యాదవ సంఘాల జేఏసీ నాయకులతో కలిసి ఆవిష్కరించిమాట్లాడారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుల పాలన, కుటుంబ పాలన చేస్తున్నారని ఆయన విమర్శించారు.స్థానిక సంస్థల్లో 42 బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో యాదవులకు మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, కార్పొరేషన్ చైర్మన్లుగా అనేక అవకాశాలు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యాదవులతో పాటు గతంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన మున్నూరు కాపు సామాజిక వర్గంతోపాటు ఎంబీసీలకు కూడా మంత్రివర్గంలో చోటు కల్పించాలని రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. మరోవైపు ఈనెల 30న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ దగ్గర జరగబోయే యాదవుల ఆత్మగౌరవ సభను పార్టీలు, సంఘాలకు అతీతంగా జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి అయిలబోయిన రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానాలు నమ్మి ఓట్లేసిన యాదవులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ ఆరోపించారు. తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి లబ్ధిదారుల ఖాతాల్లో రెండు లక్షల రూపాయలు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టిజెఎస్ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ. రంగారెడ్డి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్, తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గంగుల మధు యాదవ్, యాదవ్ మలేష్ యాదవ్, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు వాసుకే యాదవ్, శ్రీశైలం యాదవ్ , యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు గుడిగె శ్రీనివాస్ యాదవ్, కుందేలు శంకర్ యాదవ్, బైకానీ శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


గండిపేటలోని ఎంజిఐటీ కళాశాలలో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్న పోలీసులు, ప్రొఫెసర్లు.

**నార్సింగి, జూన్ 25 ప్రభాతవార్త :** బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారి రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గండిపేటలోని ఎంజిఐటి కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమేష్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ మన మెదడుపై చెడు ప్రభావాన్ని కలిగిస్తుందన్నారు. డ్రగ్స్‌ను తెలిసిన వాడినా, తెలియక వాడినా చట్టరిత్య నేరమే అవుతుందని, కఠినమైన శిక్షలున్నాయని హెచ్చరించారు. మీ తల్లిదండ్రులు అనేక కష్టనష్టాలకు ఓర్చి, కడుపులు మాడ్చుకొని కూడబెట్టుకున్న సొమ్ముతో మీకు బంగారు భవిష్యత్తును ఇవ్వాలని లక్షల రూపాయలు పెట్టి పేరున్న కళాశాలల్లో ఉన్నత విద్యలను చదివిస్తున్నారని, చక్కగా కళాశాలకు వచ్చి, శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలు, స్నేహం చేయడం వలన మీ జీవితంను మీరు నాశనం చేసుకోవడంతో పాటు, మీ తల్లిదండ్రులు, మీ గురువులకు కూడా చెడు పేరు వస్తుందన్నారు. మనం ఖర్చు చేసే ప్రతీ పైసా మన తల్లిదండ్రుల రక్తంతో వచ్చిందన్న వాస్తవంను గుర్తుంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. నాలుగేళ్ల కష్టపడితే రాబోయే 40.ఏళ్ల సుఖపడుతారని, ఆకర్షణలకు లోనుకావద్దని, ఆకతాయిలుగా మారవద్దని పేర్కొన్నారు. అనంతరం ఎంజిఐటి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్ర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే డ్రగ్స్ అలవాటు చివరికి ప్రాణాలను కూడా హరిస్తుందని, ఇలాంటి దుష్పరిణామాలున్న చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడి డాక్టర్ వి.హరిలీల, బి.శశిధర్‌రెడ్డిలతో పాటు నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్లు, నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణరెడ్డి, 200.మంది విద్యార్థులు, అధ్యాపకుల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## బోనాల వేడుకలకు ఆహ్వానం


ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు ఆహ్వానం అందజేస్తున్న దేవాదాయశాఖ అధికారులు

**సికింద్రాబాద్, జూన్ 25 ప్రభాతవార్త:**
నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే ఆషాడ మాస బోనాలు వేడుకల్లో పాల్గొనాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ మంత్రి తీగుల్ల పద్మారావు గౌడ్‌ను ప్రభుత్వ దేవాదాయ శాఖ అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు దేవాదాయ శాఖకు చెందిన అధికారి రాజేష్‌తో పాటు అధికారుల బృందం పద్మారావు గౌడ్‌ను మోండా మార్కెట్ లోని ఆయన నివాసంలో కలుసుకొని గోల్కొండ, ఉజ్జయిని మహంకాళి, బాల్కంపేట్ బోనాలు వేడుకల ఆహ్వాన పత్రికలను పద్మారావు గౌడ్‌కు అందించారు.

## కళ్యాణ్‌నగర్ చౌరస్తాకు పిజేఆర్ నామకరణం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిశేఖర్ రెడ్డి

**ముషీరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** వెంగళరావు నగర్ వెళ్లే ప్రధాన రహదారిలోని కళ్యాణ్ నగర్ చౌరస్తాకు పి.జే.ఆర్.చౌరస్తాగా నామకరణం చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పి.వి.రవి శేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం వెంగళరావునగర్‌లోని మధురానగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదోళ్ల దేవుడు, మాజీ సీఎల్పీ నేత దివంగత పి.జనార్ధన్‌రెడ్డి అని, తెలంగాణ ప్రభుత్వం ఆ మహానుభావుని పేరును గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్‌కు పెట్టటం అభినందనీయమన్నారు. అదే విధంగా పి.జే.ఆర్. విగ్రహం ఉన్న కళ్యాణ్‌నగర్ చౌరస్తాకు కూడా పీజేఆర్ చౌరస్తా అని అధికారికంగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వెంగళరావునగర్ డివిజన్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఏ.సన్నీగౌడ్, డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏ.వి.మల్లేష్‌గౌడ్, నాగరాజు, భరత్ పాల్గొన్నారు.

## 28న ఇస్కాన్ మియాపూర్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర

**హైదరాబాద్, జూన్ 25,ప్రభాతవార్త:**
అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్), మియాపూర్ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 28న జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నామని మియాపూర్ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు శ్రీరాందాస ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ చందానగర్ లోని ఆర్.ఎస్. బ్రదర్స్ వద్ద ఈ రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.ఈయాత్ర మదీనగూడ, ఆల్విన్ క్రాస్ రోడ్, మియాపూర్ క్రాస్ రోడ్, జె.పి.నగర్ వీధుల గుండా కొనసాగుతూ విశ్వనాథ గార్డెన్ వద్ద ముగుస్తుందన్నారు. ఈ రథయాత్ర దారి పొడువునా భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, పులిహోర ప్రసాదం అందజేయటం జరుగుతుందని, యాత్రలో వివిధ రకాల సంకీర్తనలతో, నృత్యాలలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ విశ్వనాథ గార్డెన్ లో సమావేశం ఉంటుందని, ఇందులో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభూజీల ప్రసంగాలు ఉంటాయని, అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ ఉంటుందని తెలిపారు. రథయత్ర సమావేశంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీరాందాస విజ్ఞప్తిచేశారు.

**చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి : శ్రీధర్**

**కంటోన్మెంట్,జూన్ 25 ప్రభాతవార్త:** చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించేందుకు సిస్టర్లు, ఆశా వర్కర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి ఉబ్బాల శ్రీధర్ తెలిపారు. బుధవారం తుకారాంగేట్‌లోని అడ్డగుట్ట ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించి చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఏ విధంగా వేయిస్తున్నారని నర్సింగ్ సిస్టర్లు, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించి ఆయా బస్తీలలోని వ్యాధి నిరోధక రికార్డులను ఆయన పరిశీలించారు.

## దివ్యాంగుని షాపులో దొంగతనం

**ముషీరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:**
కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఒక దివ్యాంగుని షాపులో మంగళవారం రాత్రి దొంగతనం జరగటం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇందిరాపార్కు ప్రధాన గేట్ వద్ద ఫుట్‌పాత్‌పై జాన్ (25) అనే దివ్యాంగుడు ఒక చిన్న దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి జాన్ దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి దుకాణం తీసే ప్రయత్నం చేస్తూ ఉండగా దుకాణంకు తలుపుగా ఉన్న చెక్క కోసి వేసినట్లు గుర్తించాడు. అనుమానం వచ్చి తీసిచూడగా దుకాణంలోని గల్లా పెట్టెలో ఉండవలసిన 6,500 రూపాయల డబ్బు, దుకాణంలోని కొంత సామాను కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డారని గుర్తించిన జాన్ దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

## 42శాతం రిజర్వేషన్ల నిర్ణయంపై బిసి సంఘాల హర్షం



**హైదరాబాద్ జూన్ 25 ప్రభాతవార్త :**
రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ సంఘాలు స్వాగతిస్తున్నాయని బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్, బాలగౌని బాల్ రాజ్ గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సూగూరి దుర్గయ్య, గౌడ్,గౌడ సమన్వయ సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్, అయిలి వెంకన్న గౌడ్ తదితర నేతలు పేర్కొన్నారు.బుధవారం చిక్కడిపల్లి ఏర్పాటు చేసిన సమావేశం వారు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లను 42 శాతం 30 రోజులు గడువు కోరిన ప్రభుత్వం, రిజర్వేషన్లపైన పూర్తి స్పష్టతో ప్రభుత్వం ఉందని ఇంకొంచెం గడువు కావాలని, గడువు లోపు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ గౌడ్ ,పిసిసి అధ్యక్షులు,బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,మంత్రి వర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలిపారు,, తక్షణమే సియం రేవంత్ రెడ్డి అఖిల పక్ష నేతలను,బీసీ సంఘాల నాయకులను ఢిల్లీ తీసుకెళ్లి ప్రధాని నరేంద్ర మోడీనీ ఒప్పించాలి.పార్లమెంటు లో బీసీ బిల్లుకు ఆమోదం పొందేలా చొరవ చూపాలని,బిసిలకు జనాభా దామాష పద్ధతిలో అన్ని రంగాలలో విద్యా,ఉద్యోగ,ఆర్థిక రాజకీయ రంగాలలో సమ న్యాయం జరిగే వరకు మా పోరాటం కొన సాగిస్తామని,దీనికి బీజేపీ కేంద్ర మంత్రులు, బండి సంజయ్ ,కిషన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు, ఈటల రాజేందర్, ధర్మ పూరి అరవింద్, ప్రత్యేక చొరవ తీసుకొని ప్రధాని నరేంద్ర మోడీ నీ ఒప్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నాగేష్ గౌడ్,బీసీ రచయితల సం ఘం రాష్ట్ర అధ్యక్షులు బైరూ శేఖర్, ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడే సాబ్,సీనియర్ బీసీ నాయకులు,బాలగోని వెంకటేష్ గౌడ్ , పోతగాని ఐలెని గౌడ్ పాల్గొన్నారు.

## దుర్గమ్మ సన్నిధిలో ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్



బక్కి వెంకటయ్యను సన్మానిస్తున్న ఈట

**పాపన్నపేట, జూన్ 25, ప్రభాతవార్త:**
ఏడుపాయల వన దుర్గ భవాని మాతను రాష్ట్ర ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ మెంబర్లు నీలిమదేవి, రాంబాబునాయక్, శంకర్, లక్ష్మీ మ్నారాయణ, ప్రవీణ్ తదితరులు బుధవారం దర్శించుకున్నారు, ఈసందర్భంగా ఆలయ ఈవో అర్చకులు వారికి ఆలయ మర్యాద ప్రకారం వారికి స్వాగతంపలికారు. అనంతరం వారిపేర ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరికి ఆలయ కార్య నిర్వాహణాధికారి చంద్రశేఖర్ శాలువాతో సత్కరించగా, వీరివెంట తహసీ ల్దార్ సతీష్ తదితరున్నారు.

## బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన సిపి



బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సిపి అనురాధ

**గజ్వేల్, జూన్ 25, ప్రభాతవార్త:**
వార్షిక తనిఖీలో భాగంగా కుకునూర్‌పల్లి, బేగంపేట పోలీస్‌స్టేషన్లను సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ల పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్, రికార్డు, రైటర్ రూమ్ పరిశీలించడంతో పాటు పోలీస్‌స్టేషన్ల ఆవరణలో మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నర్సింహులు, తొగుట సిఐ లతీఫ్, కుకునూర్‌పల్లి ఎస్ఐ శ్రీనివాస్, బేగంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, తొగుట ఎస్ఐ రవికాంత్‌రావు, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, కోర్టు మానిటర్ ఎస్ఐ రాజేశ్, ఏఎస్ఐలు జగదీశ్వర్, మధుసూదన్, సువర్ణ, ప్రేమ్‌రాజ్, హయాబ్‌ఖాన్, సిసి నితిన్‌రెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఎస్ఐని సన్మానించిన జర్నలిస్టులు

**సిర్గాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**
సిఐగా పదోన్నతి పొందిన సిర్గాపూర్ పోలీసు ఠాణా ఎస్ఐ వెంకటరెడ్డిని బుధవారం మండల విలేఖరులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## మా విద్యార్థులకు సౌకర్యాలు అందేలా చూడండి

**-ఎంఈఓకు మండల పాత్రికేయులు వినతి**

**సిర్గాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**
ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ సమాజ సంక్షేమానికి కృషిచేస్తున్న పాత్రికేయులు (ప్రింట్‌అండ్‌ఎలక్ట్రానిక్‌మీడియా)లకు విద్యా పరంగా అందాల్సిన సౌకర్యాలు (ప్రయివేటుపాఠశాలలో ఫీజ్ రియెంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, ఉపకరణాల సహాయం తదితర) అందేలా కృషిచేయాలని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్‌కు మండల పాత్రికేయులు బుధవారం వినతిపత్రం అందచేశారు.

## సిపిఐ జిల్లా మహాసభ వాయిదా

**-ఆహ్వాన సంఘం అధ్యక్షులు గడిపె మల్లేష్**

**హుస్నాబాద్ రూరల్, జూన్ 25, ప్రభాతవార్త:**
ఈనెల 27వ తేదీన హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో జరగాల్సిన సిపిఐ పార్టీ జిల్లా మహాసభ వాయిదా వేసినట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు, సిపిఐ పార్టీ రాష్ట్రసమితి సభ్యులు గడిపె మల్లేష్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పార్టీ బలోపేతంకోసం మూడేళ్ల కొకసారి పార్టీ సంస్థాగతంగా నిర్మాణాన్ని పెంపొందించడం కోసం గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు నిర్వహించే మహాసభల్లో భాగంగా ఈ సభ నిర్వహించడం జరుగుతుందని నిర్వహించాలని ఏర్పాటుచేసిన అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందన్నారు. తదుపరి తేదీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కార్యదర్శి సుదర్శనచారి, కోశాధికారి ఎడల వనేష్, జనగాం రాజ్‌కుమార్, పద్మ, కుమారస్వామితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌రహిత సమాజానికి ప్రతి ఒక్కరు సహకరించాలి

**-హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్**

**హుస్నాబాద్ టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:**
డ్రగ్స్ రహిత సమాజాన్ని తయారు చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని హుస్నాబాద్ ఎస్ఐ తోట మహేష్ అన్నారు. బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సులలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్, పాఠశాలలు, కళాశాలలో ఉన్న విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తుపదార్థాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వ్యాస రచనతో పాటు పెయింటింగ్ పోటీలు నిర్వహించి మొదటి, రెండు, మూడవ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు ఉన్నారు.

## ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

**-ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్‌కు బిఆర్ఎస్ నాయకుల వినతి**

**హుస్నాబాద్ టౌన్, జూన్ 25, ప్రభాతవార్త:**
హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీచేయాలని కోరుతూ బిఆర్ఎస్‌పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డిలు బుధవారం ఆసుపత్రి సూపరిండెంట్ రమేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఈ ఆసుపత్రి నాలుగు జిల్లాలకు సరిహద్దుల్లో ఉందని ఈ అసుపత్రిపై ఈప్రాంతానికి చెందిన యాభై వేల మంది ఆధారపడి ఉన్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆసుపత్రిలో సిబ్బంది లేక సరైన చికిత్స అందించకపోవడంతో రోగులు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్తు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాకాల శ్యాంసుందర్‌గౌడ్, మేకల వికాస్‌యాదవ్, జేరిపోతుల సునీత, లక్ష్మన్, రాజిరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన

**కోహెడ, జూన్ 25, ప్రభాతవార్త:**
యాంటీడ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా పోలీసుస్టేషన్ పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల కోహెడలో బుధవారం ఏర్పాటు చేసిన డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ పి.అభిలాష్ మత్తు పదార్థాల వినియోగంతో కలిగేనష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువత మత్తుపదార్థాలకు బానిస కావద్దు

**-గజ్వేల్ సిఐ సైదా**

**గజ్వేల్, జూన్ 25 (ప్రభాతవార్త):**
విద్యార్థులు, యువత గంజాయి, ఇతర మత్తుపదార్థాలకు బానిస కావద్దని గజ్వేల్ సిఐ సైదా పేర్కొన్నారు. బుధవారం యాంటీడ్రగ్స్ అవేర్నెస్ వారోత్సవాల సందర్భంగా సిద్దిపేట సిపి అనురాధ ఆదేశానుసారం గజ్వేల్‌లోని బాయ్స్ ఎడ్యుకేషన్‌హబ్‌లో విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడడం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మీపిల్లలు ఏమి చేస్తున్నారో గమనించాలన్నారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగి ఉండవలసిన వారని, కొంతమంది చెడుమార్గాల వైపు ఆకర్షితులై మత్తుకు అలవాటుపడి జీవితాలను చిత్తుచేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బాయ్స్ ఎడ్యుకేషన్ హబ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆస్తులు కూడబెట్టుకోడానికేనా రాజకీయాలు?

## -యువతరంలో నేతలపై పెరుగుతున్న అసహనం

**టేక్మాల్, జూన్ 25, ప్రభాతవార్త:**
అర్హత ఉన్నవాడే అసెంబ్లీలో ఉండాలి. పద్ధతిగల వారే పార్లమెంట్లో ఉండాలి. మర్యాద ఉన్నవాడే మేయర్ అవ్వాలి. సభ్యత ఉన్నావాడే సర్పంచ్ అవ్వాలి. ఇవి అన్నీ ఉన్నవాడే రాజకీయ నాయకుడు అవుతాడని యువకులు అంటున్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని యువకులకు ప్రజలకు అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు రాజ కీయం అంటే సేవచేయడమా లేక వ్యాపారమా..? అని తెలియక యువకులు ప్రజలు సతమతమవు తున్నారు. కానీ రాజకీనాయ నాయకులు మాత్రం రాజకీయాన్ని పూర్తిగా వ్యాపారంగా మార్చేశారాని అతి తక్కువ సమయంలో రాజకీయ నాయకులు వేల కోట్లకు పడగలెత్తారన్నది కాదనలేని నిజం. నిజమైన నాయకులు సేవ కోసం రాజకీయాలకు వస్తే వేల కోట్లు ఎలా సంపాదించారని యువత ప్రశ్నిస్తుంది. ప్రస్తుతసమాజంలో అధికారాన్ని ఆస రాగా చేసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రజలకు రావలసిన ధనాన్ని రాజకీయ నాయకులుదోచుకుంటున్నారని ప్రజలువిమర్శిస్తున్నారు. ప్రస్తుత సమాజంలో సేవచేసే రాజకీయ నాయకులు అరుదుగా ఉన్నారని, అధికారం కోసం, ఆస్తులుసంపాదిచుకోవడానికి మాత్రమే రాజకీయంలోకి వస్తున్నారన్నది జగమెరిగిన సత్యం. ప్రజలు ఓట్లు వేసి వేసి అలసిపోయారని, రోజు రోజుకు మోసంచేసే నాయకులు పెరిగిపోయారని ఆవేదన చెందుతున్నారు. ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా సేవచేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి రావడంలేదన్న భావన ప్రజల్లో ముఖ్యంగా యువకుల్లో నాటుకు పోయింది. పూటకో జెండా రోజుకో పార్టీ మారే నాయకులను నమ్మే పరిస్థితి లేదు. అటువంటప్పుడు రాజకీయపార్టీలను కూడా నమ్మే పరిస్థితి లేదని ప్రజలు, యువకులు రాజకీయ నాయకులపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎలక్షన్లప్పుడే ప్రజలు గుర్తుకువస్తారా అని రాజకీయ నాయకులను ప్రశ్నిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో యువత ముఖ్యభూమిక పోషించే అవకాశం ఉందని అర్థమవుతుంది. దేనినైనా మార్చగలిగే సత్తా కేవలం యువతరానికే ఉంది. శ్రమతో సంపాదించుకు తినే పల్లె ప్రజలకు అక్కరలేని పథకాలను పంచిపెట్టి సోమరితనాన్ని తెచ్చి ఇచ్చి అంటగడుతున్నారని మండిపడుతున్నారు. పేద ప్రజానీకాన్ని అభివృద్ధి పర్చాలన్న ఉద్దేశ్యం రాజకీయపార్టీలకు ఉంటే విద్య, వైద్యాన్ని, రైతులకు ఉపయోగపడేవిధంగా సబిడీ విత్తనాలను, గిట్టుబాటు ధరలను సంపూర్ణంగా అందిస్తే రైతు రారాజేకదా అని యువతరం ఆలోచనచేస్తోంది.

## డ్రగ్‌రహిత సమాజం మన అందరి బాధ్యత

**-సిపి డాక్టర్ అనురాధ**



సిద్దిపేట-4: ఓపెన్ హౌస్‌లో మాట్లాడుతున్న సిపి డాక్టర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
డ్రగ్‌రహిత సమాజం మన అందరి బాధ్యత అని సిపి డాక్టర్ అనురాధ అన్నారు. యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించి మాట్లాడారు. మారకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువత మత్తుపదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయితీసుకున్నా గంజాయి, డ్రగ్స్ కలిగి ఉన్నట్లు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 1908 కాల్ చేయాలన్నారు. అలాగే సిపి కార్యాలయం కంట్రోల్ రూమ్ నంబరు 8712667100 కాల్ చేయాలన్నారు. అనంతరం ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న విద్యార్థులకు సిపి స్వయంగా ఆయుధాలు, పోలీసు, చట్టాలు, సిసి కెమెరాలు వలన కలిగే ఉపయోగాలు, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలపై స్వయంగా వివరించారు. ఈసందర్భంగా మారక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు సుభాష్ చంద్రబోస్, రవీందర్‌రెడ్డి, సుమన్‌కుమార్, రామకృష్ణ, శ్రీధర్, వాసుదేవరావు, ఉపేందర్, ప్రవీణ్‌కుమార్, పూర్ణచందర్, విష్ణుప్రసాద్, దుర్గ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అధిక ప్రయోజనాలు

**నాబార్డు జిల్లా అధికారి నిఖిల్‌రెడ్డి**

**కొండపాక, జూన్ 25, ప్రభాతవార్త:**
రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అధిక ప్రయోజనలున్నాయని నాబార్డు జిల్లా అధికారి నిఖిల్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపాక రైతు ఉత్పత్తిదారుల కంపెని డైరెక్టర్‌ల సమావేశం తిమ్మారెడ్డిపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు సంఘటితమై ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడడంవల్ల రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సమకూర్చుకోవడంతో పాటు వ్యాపార కార్యక్రమాలు నిర్వహించి లాభాలు పొందవచ్చునన్నారు. అందుకుగాను నాబార్డు తనవంతుగా సహాయ సహకరాలు అందిస్తుందన్నారు. రైతు సంఘాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకరాన్ని పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో అస్మా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నర్సింహ, సిఈఓ మహేందర్, ఎఫ్‌పిఓ డైరెక్టర్‌లు యాదగిరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యలు పరిష్కరించాలి

**-సిద్దిపేట సిపి డాక్టర్ అనురాధ**

**కొండపాక, జూన్ 25, ప్రభాతవార్త:**
ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ సూచించారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌ను అమె సందర్శించారు. ఈ సందర్భంగా అమె పోలీస్ స్టేషన్ పరిసరాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డును, రైటర్ రూంను పరిశీలించి, మొక్కను నాటారు. అనంతరం అమెమాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ ఎసిపి నర్సింలు, తొగుట సిఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, ఎఎస్ఐ సువర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎపిట్రిపుల్‌ఐటికి ఎంపికైన విద్యార్థులు

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 25, ప్రభాతవార్త:**
ఇటీవల మొదలైన ఎపిట్రిపుల్‌ఐటి విద్యార్థుల ఎంపిక ప్రక్రియలో రామాయంపేటకు చెందిన వివేకానంద విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన ఎ.ప్రణతి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా, ఎ.అక్షర శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ప్రతిభ చాటిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయులు ఎ.రామ్‌కుమార్ అభినందించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలి

**-బిజెపి మండల అధ్యక్షుడు నీల సత్యం**

**కొండపాక, జూన్ 25, ప్రభాతవార్త:**
పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరి చేయాలని కొండపాక మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు నీల సత్యం కోరారు. బుధవారం అయన ఎంపిడిఓ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా పక్షపాతం చూపకుండా మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. గ్రామ సభల ద్వారానే అర్హులైన వారందరిని గుర్తించాలన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సూచించిన పేర్లను ఒకటికి రెండుసార్లు అధికారులు పరిశీలించాలన్నారు. నిజమైన అర్హులకు కాకుండా అనర్హులకు ఇండ్లు మంజూరైతే అధికారులను నిలదీయడం తప్పదన్నారు. పక్షపాతంలేకుండా, ఏలాంటి ప్రలోభలాకు తావులేకుండా అధికారులు చర్యలు తీసుకొవాలని కోరారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**-నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి**

**నర్సాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**
యువత మాదకద్రవ్యాలకు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ శేషాచారి ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు నషముక్తా భారత అబియాన్ కార్యక్రమంలో భాగంగా యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఏ విధంగా అమ్మబడతాయి, ఏ విధంగా గుర్తించాలి, ఎలా కనబడతాయో అన్న అంశాల పై యువతకు వివరించారు. చిన్నతనం నుండే మాదక ద్రవ్యాల గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నతనం నుండే మాదకద్రవ్యాల మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఎక్కడైనా మాదకద్రవ్యాలను మత్తు పదార్థాలను అమ్మిన వాడకం చేసిన వెంటనే వారిని గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సరళ కుమారి, కవిత, బాలల పరిరక్షణ కోఆర్డినేటర్, కమ్యూనిటీ ఎడ్యుకేటర్ లక్ష్మీ మ్ ప్రసన్న, పోలీస్ శాఖ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, కళాశాల సిబ్బంది, అంగన్ వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ప్రతిభను వెలికి తీయడానికే బాలమేళా

**-ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు**

**కొండాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**
పిల్లల ప్రతిభను వెలికి తీయడమే బాలమేళా ఉద్యేశ్యమని ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు అన్నారు. బుధవారం నాడు మండల పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల తొగరపల్లిలో బుధవారం నిర్వహించిన బాలమేళ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలమేళా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పిల్లలప్రతిభను వెలికితీయడం, ఆత్మవిశ్వాసం పెంపొందించడమన్నారు. టిఎల్ఎం ద్వారా ప్రదర్శనచేయడం అభినంద నీయమన్నారు. ఈకార్యక్రమంలో మండలవిద్యాధికారి దశరథ్, సిడిపిఓ చంద్రకళ, సూపర్వైజర్‌లు విమల, శైలజ, అంగన్వాడి టీచర్స్ స్వప్న,సుశీల, లలిత, అరుణ. అనసూయ,భ్రమరాంబ, ప్రమీల,మార్తమ్మ, వనిత, మాలతి, చంద్రకళ,అమరావతి, సరోజ, పుతిలి భాయ్, ఆయాలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విద్యా పురస్కారం అందుకున్న డా.రామకృష్ణ

**సదాశివపేట, జూన్ 25, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం, నిజాంపూర్(కె) ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్.పోట్రు రామకృష్ణ అంతర్జాతీయ పురస్కారం అందుకున్నారు. వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో బుధవారం ఏఎస్‌రావునగర్ రెసిడెన్సి కమ్యూనిటీ హాల్, ఈసీఐఎల్ హైదరాబాద్‌లో జరిగిన ప్రతిభాపురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ ఈ పురస్కారంను దీపాలి, శిరీష మోను వంటి ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు. రామకృష్ణ విద్యారంగంలో చేసిన విశేష కృషికి గాను ఈ పురస్కారం లభించింది. ఈసందర్భంగా రామకృష్ణను మండల విద్యాధి కారి శంకర్, మండల నోడల్ అధికారి సుధాకర్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు రాజశ్రీ, ఏదో ఉపాధ్యాయ సంఘ నాయకులు, వివిధ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## రామాయంపేటలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 25, ప్రభాతవార్త:**
రామాయంపేటలోని 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో నేడు (గురువారం) నాడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు, ఏడీఈ ఆదయ్య, ఏఈ తిరుపతి రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన 11కెవి డెడికేటెడ్ ఫీడర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం ఏర్పడుతుందని వారు వెల్లడించారు. ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఈ పనుల కారణంగా దామరచెరువు, రామాయంపేట వ్యవసాయ సరఫరా, రామాయంపేట పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదు అని తెలిపారు.

# హరీష్‌రావును విమర్శించేస్థాయి ఆవుల రాజిరెడ్డికి లేదు

**-రాజిరెడ్డికి ఏ ప్రోటోకాల్ ఉందని ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్నారు?**

**-ఎమ్మెల్యే సునీతారెడ్డి రాజకీయం ముందు రాజీరెడ్డి అనుభవం ఎంత?**

**-నర్సాపూర్ బిఆర్ఎస్ నాయకులు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు తదితరులు

**నర్సాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ నాయకులు మాట్లాడే ముందు చూసి మాట్లాడాలని ఒక మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావును విమర్శించే ముందు కాంగ్రెస్ నాయకులు స్థాయి మరిచి మాట్లాడడం సబబు కాదని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావును విమర్శించే స్థాయి ఆవుల రాజిరెడ్డికి లేదని టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భోగ చంద్రశేఖర్, శివకుమార్, జితేందర్ రెడ్డిలు అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ప్రతిపక్షాలపై విచ్చలవిడిగా నోరు పాడేసుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకులను విమర్శించే ముందు తమస్థాయిని మరిచి మాట్లాడడం సరి కాదన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మా రెడ్డిని విమర్శించేస్థాయి కాంగ్రెస్‌నాయకులకు లేదని ఇకనైనా నోరు అదుపులోపెట్టుకొని మాట్లాడాలని వారు కాంగ్రెస్‌నాయకులను హెచ్చరించారు. ఎమ్మెల్యేగా ఓటమి చవిచూసిన రాజీరెడ్డి నర్సాపూర్‌కు ఎప్పుడొచ్చాడని ఎమ్మెల్యే సునీతారెడ్డి రాజకీయం ముందు నీ అనుభవం ఎంతని వారు రాజిరెడ్డిని ప్రశ్నించారు. ప్రోటోకాల్ అంటూ సునీత లక్ష్మారెడ్డిని హేళన చేస్తూ దొంగ చాటుగా కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఏ హోదాలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటావని అన్నారు. మీపార్టీ కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాల్లో పాల్గొలన్నారు. ఈమేరకు కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగాప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నయీముద్దీన్, సత్యంగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రింగుల ప్రసాద్, ఆనంద్‌కుమార్, రాజేందర్ నాయక్,సుధాకర్‌రెడ్డి,మదన్మోహన్, ఆంజనేయులు గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ..

**సిద్దిపేట అర్బన్, జూన్ 25, ప్రభాతవార్త:**
సిద్దిపేటఅర్బన్ మండలపరిధిలోని బక్రిచెప్యాలలో పార్టీ సీనియర్‌నాయకులు పాశం యాదగిరి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అదేగ్రామానికి చెంది, పార్టీ కార్యకర్త శ్రీనివాస్ అన్న ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే సిద్దిపేటలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి తండ్రి మృతి చెందగా బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అలాగే గట్లమల్యాలలో అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుకు హరీష్‌రావు ఆర్థిక సహాయం అందించారు. అలాగే బక్రిచెప్యాల గ్రామంలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందించారు. అనంతరం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో 227 మంది లబ్దిదారులకు రూ.50 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

## ఎస్సి ఎస్టి కేసులు, భూముల సమస్యలు పరిష్కరించాలి

**-ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జూన్ 25, ప్రభాతవార్త:**
జులై 30వ తేదీవరకు ఎస్సి ఎస్టి కేసులు, భూముల సమస్యలు పరిష్కరించాలని లక్ష్యంగా ఎస్సి ఎస్టి కమిషన్ సమీక్ష నిర్వహించినట్లు రాష్ట్ర ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధ్యక్షతన జిల్లాలోని ఎస్సి ఎస్టి కుల సంఘాల నాయకులు, జిల్లా అధికారులతో జరిగిన సమీక్ష సమావేశానికి ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ భక్తి వెంకటయ్య, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారుల ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఎస్సి ఎస్టిలకు సంబంధించిన పెండింగ్ కేసులు జూలై 30వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రతి నెల అన్ని మండలాలలో పౌరహక్కుల దినోత్సవం కచ్చితంగా నిర్వహించాలని, తహసీల్దారులు, ఎస్సైలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రభుత్వం ఎస్ నుండి వచ్చే ఎస్సి ఎస్టి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా ఎస్సి ఎస్టిల సంక్షేమం కోసమే వినియోగించాలన్నారు. ఎస్సీ ఎస్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేద్కర్ ఓవర్సీస్ పథకంపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి ఎస్సి ఎస్టి విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఈ పథకాన్ని వినియోగించుకొని లబ్ది పొందేల చూడాలని అధికారులకు ఆదేశించారు. సంక్షేమ హాస్టల్‌లో నూతన మెనూప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులు ఎస్సి ఎస్టిల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఈసందర్భంగా సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు ఎస్సిఎస్టిలకు 41శాతం కేటాయించినందుకు జిల్లా యంత్రాంగాన్నీ అభినందించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్సి ఎస్టిల సంక్షేమం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎస్సి ఎస్టి భూసమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుకూలంగా ఎస్సి ఎస్టి సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం రమేష్, రాంబాబు నాయక్, శంకర్, నీలాదేవి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ గ్రామ పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

**-కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**నర్సాపూర్, జూన్ 25, ప్రభాతవార్త:**
గత బిఆర్ఎస్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసి, గ్రామపంచాయతీ సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు చెల్లించలేకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునేలా ఉసిగొలిపిన ప్రభుత్వం విఆర్ఎస్ ప్రభుత్వమని, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి ,జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి లు అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, మండలంలోని జక్కపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ విగ్రహావిష్కరణకు వచ్చిన ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి బదులుగా టిఆర్ఎస్ పార్టీ కార్యక్రమంగా నిర్వహించి, ప్రజా ప్రభుత్వమైనా కాంగ్రెస్ పై లేనిపోని నిందలు వేసి అబద్దాలకు మారుపేరుగా నిలిచిన ఎమ్మెల్యే హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేలా మాట్లాడడం టిఆర్ఎస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు. టిఆర్ఎస్ పాలనలో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు అదనంగా పదిహేను లక్షల నిధులు ఇస్తామని సర్పంచులను ఏకగ్రీవం చేసి, చేసిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో టిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచి లే ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు గుర్తు తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్త, నర్సాపూర్ మాజీ ఎంపీపీలు జ్యోతి సురేష్ నాయక్, శ్రీనివాస్ గౌడ్,లలిత నర్సింగ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్,నాయకులు హబీబ్ ఖాన్, నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేశం, హత్నూర మండల అధ్యక్షులు క్రిష్ణ, నర్సాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, అజ్మత్, హర్షవర్ధన్, కుమ్మరి నగేష్, కుమ్మరి సురేష్, ఉమర్, వెంకటేశ్ నర్సాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్,, మణిదీప్, ప్రసాద్, శ్రీకాంత్, సుధీర్ కుమార్ గౌడ్, నాయకులు యూత్ కాంగ్రెస్‌నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌రహిత సమాజం కోసం కృషి చేయాలి

**-ఎస్ఐ దామోదర్**

**మర్కుక్, జూన్ 25 (ప్రభాతవార్త):**
డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. యాంటీ డ్రగ్స్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మర్కుక్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్ రహిత సమాజం విద్యార్థుల పాత్ర అనే అంశంపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో దామరకుంట జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థిని సిందుజ ప్రథమ స్థానంలో నిలువగా మర్కుక్ జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి దీపక్ ద్వితీయ స్థానంలో నిలువగా జూనియర్స్ విభాగంలో మర్కుక్ జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థి సమ్మిత నరపథమ స్థానంలో నిలువగా, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిన చందన ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, లతిసైదా, బాలకృష్ణ, పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రామకృష్ణరెడ్డి, వెంకటయ్య, గణేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై, వ్యవసాయ పద్ధతులపై శిక్షణ శిబిరం

**వర్గల్, జూన్ 25 (ప్రభాతవార్త):**
మండల పరిధిలోని మజీద్‌పల్లి గ్రామంలో గల రైతు వేదికలో బుధవారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ జీడిమెట్ల ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై, మంచి వ్యవసాయ పద్ధతులపై ఒకరోజు రైతు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కూరగాయల పంటలలో వచ్చే పురుగులు, వ్యాధుల నివారణపై శిక్షణ ఇచ్చారు. కూరగాయల పంటలపై మంచి వ్యవసాయ పద్దతులను వివరించారు. అలాగే ఉద్యానపంటల ద్వారా అమలుపరుస్తున్న సబ్సిడీలను రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సురేష్ నేటఫిమ్ ఆగ్రోనామిస్ట్, సుబ్బారావు, కోరమండల్ అసిస్టెంట్ మేనేజర్ సిద్ధారెడ్డి, జీడిమెట్ల హార్టికల్చర్ అధికారి జలంధర్, వర్గల్ మండల వ్యవసాయాధికారి శేషశయన, ఉద్యాన అధికారి డి.రమేష్, వ్యవసాయ విస్తరణాధికారులు సుప్రజ, తేజస్వి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**న్యాల్‌కల్, జూన్ 25, ప్రభాతవార్త:**
మోటారు సైకిల్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చల్లా రాజశేఖర్ తెలిపారు. బుధవారం మృతుని భార్య అందచేసిన ఫిర్యాదు ప్రకారం ఇందుకు సంబంధించి వివరాలా ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా జమిస్తాన్‌పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ (43) బీదర్ నుంచి మండల పరిధిలోని చాల్కి గ్రామం వైపు మోటారు సైకిల్ (కేఎ39ఆర్7094)పై వస్తుండగా మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో మహమ్మద్ గాయాలకు గురయ్యాడు. అటుగా వెళుతున్న వారు ప్రమాదాన్ని గుర్తించి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కొరకు హైద్రాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్యమధ్యలో మహమ్మద కానరాని లోకాలకు చేరిపోయాడన్నారు. బుధవారం మృతుడి భార్య ఇజ్రత్‌బి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా రాజశేఖర్ వివరించారు.

